పంచాయతీలకు నిధులివ్వండి

- గ్రామ పంచాయతీల్లో కుంటుపడిన పారిశుద్ధ్యం
- బీఆర్ఎస్ పాలనలో దేశానికే ఆదర్శంగా నిలిచిన పల్లెల్లో నేడు భిన్న పరిస్థితులు
- ఆర్థికభారంతో పంచాయతీ కార్యదర్శుల ఆందోళన
- మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించండి
- మంత్రి సీతక్కకు హరీశ్ లేఖ

హైదరాబాద్, జూన్ 22 (నమస్తే తెలంగాణ): పంచాయతీలకు కాంగ్రెస్ ప్రభుత్వం నిధులివ్వకపోవడంతో అభివృద్ధి స్తంభించిపోయిందని, పల్లెల్లో పారిశుద్ధ్యం పూర్తిగా పడకేసిందని మాజీ మంత్రి హరీశ్ ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామాలకు నిధులు విడుదల చేయాలని, మాజీ సర్పంచులు, కార్యదర్శుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల సమస్యలు, పరిష్కారాలపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క)కు హరీశ్ ఆదివారం లేఖ రాశారు. గ్రామాల సమగ్రాభివృద్ధిలో భాగంగా 2019లో కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం 9,350 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులను నియమించిందని గుర్తుచేశారు. ప్రభుత్వ ఆదేశానుసారం పంచాయతీల అభివృద్ధి కోసం వారు ఎంతో శ్రమించారని తెలిపారు. గ్రామ పంచాయతీలకు సకాలంలో నిధుల మంజూరు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పంచాయతీ అధికారుల కృషి వల్ల తెలంగాణ పల్లెలు అభివృద్ధిలో దేశానికే ఆదర్శంగా నిలిచాయని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత నుంచి గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితులు భిన్నంగా మారాయని ఆవేదన వ్యక్తంచేశారు.

అంధకారంలో గ్రామాలు

నిధుల్లేక పంచాయతీల అభివృద్ధి ఎక్కడికక్కడే నిలిచిపోయిందని హరీశ్ వాపోయారు. పారిశుద్ధ్యం పడకేసిందని, వీధి దీపాల నిర్వహణ లేక పల్లెలు అంధకారంలో మగ్గుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. చివరకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన ట్రాక్టర్లలో డీజిల్ పోయించలేక, ఆర్టీఏ టాక్స్ కట్టలేక అధికారులు వాటి తాళాలను ఉన్నతాధికారులకు అప్పగిస్తున్న దుస్థితి దాపురించిందని పేర్కొన్నారు. ప్రభుత్వం నిధులు ఇవ్వకపోయినా, పంచాయతీ అధికారులు అప్పులు తెచ్చి మరీ నిర్వహించే ప్రయత్నం చేశారని తెలిపారు. ఓవైపు అప్పులు పెరగటం, మరోవైపు ప్రభుత్వం నిధులివ్వకపోవడంతో కార్యదర్శులపై ఆర్థిక భారం మరింత పెరిగి వారు మానసిక ఆందోళనకు గురవుతున్నారని వాపోయారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తే నిధుల విడుదల మరింత కష్టతరమవుతుందని బాధపడుతున్నారని తెలిపారు. మాజీ సర్పంచులు సైతం చేసిన పనులకు బిల్లులు రాక తీవ్ర ఆందోళన చెందుతున్నారని వివరించారు.

ఆరు డిమాండ్లు నెరవేర్చండి..

అభయహస్తం మ్యానిఫెస్టో హామీ ప్రకారం ఔట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శులను జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా క్రమబద్ధీకరించాలని హరీశ్ డిమాండ్ చేశారు. వానకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించాలని, పారిశుద్ధ్య కార్మికులలకు వేతనాలు వెంటనే చెల్లించాలని, నిరుడు నవంబర్‌లో నిర్వహించిన ఇంటింటి కుటుంబ సర్వే డాటా ఎంట్రీ ఆపరేటర్లకు వేతనాలు వెంటనే విడుదల చేయాలని లేఖలో డిమాండ్ చేశారు.

అడవి బిడ్డలపైకి బుల్డోజర్

మొదటిపేజీ తరువాయి...

అటవీ శాఖ అధికారులు బుల్డోజర్లతో దిగబడి ఆయా భూములను స్వాధీనం చేసుకుంటున్నారు. వారిని భయభ్రాంతులకు గురిచేయడమే కాకుండా అడ్డొచ్చిన వారిపై దాడులకు తెగబడుతున్నారు. దీనికి ఇటీవల జరిగిన బూర్గంపహాడ్ ఘటనే ఉదాహరణగా నిలిచింది.

కలకలం రేపుతున్న దాడులు

ఇటీవల చుంచుపల్లి మండలం పెనగడపలోని తమ భూమిలో ట్రెంచ్ కొడుతున్న అటవీ శాఖ అధికారులు, సిబ్బందికి ఆదివాసీలు అడ్డుపడ్డారు. ఈ గొడవ కాస్తా పోలీస్ స్టేషన్ వరకు వెళ్లింది. ఇది జరిగి వారం దాటక ముందే బూర్గంపహాడ్ మండలం ఇరవెండి గ్రామం కొర్సాగుంపులో అటవీ శాఖ అధికారులు ఆదివాసీ గిరిజన మహిళలపై విచక్షణారహితంగా దాడి చేయడంతో దవాఖాన పాలయ్యారు. పోడు సాగుదారులకు చెందిన భూముల్లోకి అటవీ శాఖ అధికారులు వెళ్లడంతో గిరిజన మహిళలు, అటవీ శాఖ అధికారుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొన్నది. ఈ క్రమంలో అటవీ సిబ్బంది గిరిజన మహిళలపై దాడి చేయడంతో ఓ మహిళ దుస్తులు చిరిగిపోయాయి. ఈ ఘటన తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. ఘటనపై బూర్గంపహాడ్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివాసీలు ఫిర్యాదు చేశారు. దాడిలో గాయపడిన ఆదివాసీలను భద్రాచలం దవాఖానలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. తమ భూముల్లో కందకాలు తీస్తున్న అధికారులను అడ్డుకున్నందుకు సిబ్బంది దాడి చేశారని, దుస్తులు చింపి దౌర్జన్యానికి పాల్పడ్డారని గిరిజన మహిళలు ఆవేదన వ్యక్తంచేశారు. 25 ఏండ్లుగా 100 ఎకరాల్లో పోడు సాగు చేసుకుంటున్న తమను అటవీ శాఖ అధికారులు తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని, జేసీబీతో వచ్చి దౌర్జన్యం చేయగా అడ్డుకున్న తమను దారుణంగా కొట్టారని వాపోయారు.

పదేండ్లు ప్రశాంతంగా ఉన్న గిరిజనుల్లో చిచ్చు

గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఎలాంటి గొడవలు, ఆందోళనలు లేకుండా గిరిజనులు పోడు భూములు సాగు చేసుకుంటూ ప్రశాంత వాతావరణంలో పంటలు పండించుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా కుటుంబాలను పోషించుకున్నారు. ఈ క్రమంలో అప్పటి ప్రభుత్వం ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న గిరిజనులకు పట్టాలు అందించి వారికి భూములపై హక్కులు కల్పించింది. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనుల భూములను లాక్కునేందుకు తీరొక్క ప్రయత్నాలు చేస్తున్నదని గిరిజన సంఘాలు మండిపడుతున్నాయి. ఏజెన్సీ ప్రాంతం ఎక్కువగా ఉన్న భద్రాద్రి జిల్లాలో నిత్యం ఏదో ఒకచోట పోడు గొడవలు చోటు చేసుకుంటూనే ఉన్నట్టు చెప్తున్నాయి.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండలం ఇరవెండి బీట్ పరిధిలో శుక్రవారం గిరిజన మహిళలతో వాగ్వాదానికి దిగిన అటవీ శాఖ అధికారులు

దాడిచేసిన వారిపై చర్యలు శూన్యం

అమాయక ఆదివాసీ గిరిజన మహిళలపై దాడిచేసిన అధికారులపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తున్నది. ఎవరూ లేని సమయంలో ఎవరికీ తెలియకుండా ట్రెంచ్‌ల పేరుతో అడవిలోకి వెళ్లి ఆదివాసీ ఆడబిడ్డలపై అరాచకం చేయడాన్ని గిరిజన సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. దాడిచేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. ప్రశాంతంగా ఉన్న ఆదివాసీ గిరిజనుల బతుకులను ఇటు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం, అటు కగార్ పేరిట కేంద్ర ప్రభుత్వం ఆగం చేస్తున్నాయని మండిపడుతున్నాయి. ఇటు గిరిజనుల భూములను కాంగ్రెస్ ప్రభుత్వం లాక్కునే ప్రయత్నం చేస్తున్నదని, అటు బీజేపీ సర్కారు ఆపరేషన్ కగార్ పేరిట అడవులను జల్లెడ పడుతుండటంతో గిరిజనులు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నాయి. దాడిలో గాయపడిన మహిళలకు సీపీఎం, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు సంఘీభావం తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి దాడులు జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. దాడి చేసిన వారిపై వెంటనే కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు.

దాడులను ఖండించిన బీఆర్ఎస్

ఆదివాసీ గిరిజన మహిళలపై అటవీ శాఖ అధికారులు, సిబ్బంది దాడి చేయడం హేయమని బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. మహిళలు అని కూడా చూడకుండా బట్టలు చింపేలా కొట్టడం ఎక్కడి సంస్కృతి అని బీఆర్ఎస్ మహిళా నాయకురాలు సింధు తపస్వి మండిపడ్డారు. ఈ ఘటనపై బూర్గంపహాడ్ బీఆర్ఎస్ నాయకులు ఆందోళనలకు సిద్ధమవుతున్నారు. మహిళలపై దాడిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత కూడా ట్విట్టర్ వేదికగా ఖండించారు. బాధితులను నేడు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు పార్టీ నేతలతో కలిసి పరామర్శించనున్నారు.

దవాఖానలో మహిళలకు చికిత్స

బూర్గంపహాడ్, జూన్ 21 : అటవీ శాఖ సిబ్బంది దాడిలో గాయపడిన గిరిజన మహిళలు మడకం సునీత, మడకం నందిని, కుంజా జోగమ్మ, తాటి లక్ష్మి, శీలం చుక్కమ్మను కొర్సాగుంపు గ్రామస్థులు 108 వాహనంలో భద్రాచలం ఏరియా దవాఖానకు శనివారం తరలించారు. వైద్యులు వారికి పరీక్షలు చేసి చికిత్స అందిస్తున్నారు. శుక్రవారం నాటి దాడి ఘటనపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా తమకు ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు చెప్పడం గమనార్హం. దీనిపై కొర్సాగుంపు గ్రామ పెద్ద కోసాను అడుగగా దాడిలో గాయపడిన మహిళలను ఏరియా దవాఖానకు తీసుకెళ్లి చికిత్స చేయిస్తున్నామని, బాధిత మహిళలతో కలిసి మరోసారి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

ఈడ్చుకొనిపోయిండ్రు

మేము పత్తిగింజలు వేస్తుంటే మిషిన్ పట్టుకొని వచ్చిండ్రు. ఇక్కడికి ఎందుకొచ్చిండ్రని అడిగిన. ఏంటే అని రెండు చేతులు పట్టుకొని ఈడ్చుకుపోయిండ్రు. బూటుకాళ్లతో తన్నిండ్రు. కొంతసేపు పెనుగులాడి తప్పించుకున్న. ఆడవాళ్లమని కూడా చూడకుండా ఇష్టం వచ్చినట్టు కొట్టిండ్రు. మా భూమిలో విత్తనాలు వేసుకుంటుంటే ఎవరూ లేని సమయంలో వచ్చి దాడి చేసిండ్రు.

- మడకం సునీత, కొర్సాగుంపు, ఇరవెండి గ్రామం, బూర్గంపాడు మండలం, భద్రాద్రి కొత్తగూడెం

నైటీ చింపేసిండ్రు

మేం భూమిలో గింజలు వేస్తుంటే వచ్చిండ్రు. మిషిన్ ఎందుకు అనడిగితే కొట్టడానికి వచ్చిండ్రు. ఇంటికి ఉరుకుతుంటే నా నైటీ పట్టుకొని చింపిండ్రు. ఇష్టం వచ్చినట్టు కొట్టిండ్రు. అందరం ఆడవాళ్లం ఉన్నం. మమ్మల్ని బూటుకాళ్లతో తన్ని బూతులు తిట్టిండ్రు. ఒకడైతే ప్యాంటు ఇప్పి చూపించిండు. మమ్మల్నే కొట్టి మళ్లీ మా మీదనే కేసులు పెడుతున్నరు.

- కుంజా జోగమ్మ, కొర్సాగుంపు, ఇరవెండి గ్రామం, బూర్గంపాడు మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

అటవీశాఖ అధికారులు రెచ్చిపోతున్నరు

అమాయక ఆదివాసీలపై అటవీశాఖ అధికారులు రెచ్చిపోతున్నరు. ఆడబిడ్డలను వివస్త్రలను చేస్తరా? సిగ్గుండాలె.. ఆడవాళ్లపై దాడులు చేయడం ఎంతవరకు సమంజసం? బీఆర్ఎస్ హయాంలో పోడు చేసిన వారందరికీ పట్టాలిచ్చి ఆదుకున్నం. కాంగ్రెస్ ప్రభుత్వం అడవిబిడ్డలపై దాడులు చేస్తున్నది. చేతకాకపోతే చేతులెత్తేయాలె గని ఇదేం పని? ఆడవాళ్లను బట్టలు చిరిగేలా కొట్టడమేంది? ఇంతకంటే దుర్మార్గం ఇంకేమైనా ఉంటదా? దాడి చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నం.

- రేగా కాంతారావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే

తగిన గుణపాఠం చెప్తం

ఏండ్ల తరబడి పోడు సాగు చేసుకొని బతుకుతున్న ఆదివాసీలపై దాడులు చేయడం సరికాదు. అధికారులే గిరిజనుల దగ్గరకు వచ్చి సాగులో ఉన్న భూములకు రక్షణ కల్పించాలి. అమాయక ఆదివాసీలపై దాడులు చేస్తే ఊరుకునేది లేదు. అటవీ శాఖ అధికారులకు తగిన గుణపాఠం చెప్తాం. బడాబాబులు అడవిని నరుకుతుంటే చూస్తుంటారు.. కానీ ఆదివాసీలు తిండిగింజల కోసం సాగు చేస్తుంటే ఆడవాళ్లు అని కూడా చూడకుండా కొట్టడం ఎంతవరకు సబబు? ప్రజాపాలన అంటే ఇదేనా? ఎకరం, రెండెకరాలు సాగు చేసుకునే ఆదివాసీలపై అటవీ శాఖ పెత్తనం ఏమిటి?

- వాసం రామకృష్ణ. ఆదివాసీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు, భద్రాద్రి కొత్తగూడెం

నాట్లకు నాట్లకు మధ్య కేసీఆర్ 'రైతుబంధు'

రైతులను మోసం చేస్తున్న పార్టీకి ప్రజలే బుద్ధి చెప్తరు: ఎర్రబెల్లి

తొర్రూరు, జూన్ 22 : నాట్లకు నాట్లకు మధ్య రైతుబంధు ఇచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. అయితే కాంగ్రెస్ సర్కార్ ఓట్లకు ఓట్లకు మధ్య రైతుభరోసా ప్రకటించి, మధ్యలో రెండుసార్లు ఇవ్వకుండా ఎగ్గొట్టిందని విమర్శించారు. ఇది రైతులకు అర్థమయ్యేలా వివరించాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని పేర్కొన్నారు. ఆదివారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరులోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పాలకుర్తి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయం సాధించాలంటే ప్రతి ఒక్కరూ సమష్టిగా పని చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత 420 హామీలు ఇచ్చి ప్రజలను తప్పుదారి పట్టించిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ సర్కార్ ఒక్క హామీని కూడా సరిగా అమలు చేయలేదని మండిపడ్డారు.

ధాన్యం టెండర్లలో 1100 కోట్ల స్కాం

- ఇందులో ముఖ్యమంత్రి రేవంత్, మంత్రి ఉత్తమ్‌కుమార్ హస్తం
- ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినా పట్టించుకోరా?
- భయంతోనే హైకోర్టులో కౌంటర్ దాఖలు చేయని రేవంత్ సర్కారు
- ఈడీ, సీబీఐకి ఫిర్యాదు చేస్తాం: మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి. చిత్రంలో వై సతీశ్‌రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, కిశోర్‌గౌడ్

హైదరాబాద్, జూన్ 22 (నమస్తే తెలంగాణ): ధాన్యం టెండర్లలో రూ.1,100 కోట్ల కుంభకోణం జరిగిందని, ఇందులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హస్తం ఉన్నదని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, పౌరసరఫరాల సంస్థ మాజీ చైర్మన్ పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. టెండర్లలో పాల్గొన్న నలుగురు బిడ్డర్లు క్వింటాల్ ధాన్యానికి రూ.2,007 చొప్పున ధర నిర్ణయించి, మిల్లర్ల నుంచి రూ.2,230 చొప్పున దండుకున్నారని విమర్శించారు. ధాన్యాన్ని తరలించకుండా సొమ్ముచేసుకున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ పార్టీ 232 మంది మిల్లర్ల ఖాతాల వివరాలు, పూర్తి ఆధారాలు సహా హైకోర్టులో పిల్ దాఖలు చేసిందని చెప్పారు. ప్రభుత్వం తప్పు చేసింది కాబట్టే హైకోర్టులో కౌంటర్ దాఖలు చేయడంలేదని దుయ్యబట్టారు. ఆదివారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ధాన్యం టెండర్ల కుంభకోణంపై విజిలెన్స్ కమిషన్, ఏసీబీకి ఫిర్యాదుచేసినా చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. 35 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వానికి రూ.7,500 కోట్లు చేరాల్సి ఉండగా, కనీసం సగం కూడా జమకాలేదని ఆరోపించారు. దీనిపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి లేఖ రాసినా పట్టించుకోవడంలేదని విమర్శించారు.

ఎమ్మెల్యేలకు ముడుపులు.. ఢిల్లీకి మూటలు

ధాన్యం టెండర్లలో రూ.1,100 కోట్ల అక్రమాలకు తెరలేపిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ రూ.10 కోట్ల చొప్పున అధికార పార్టీ ఎమ్మెల్యేలకు ముడుపులు ముట్టజెప్పారని సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. మిగిలిన మొత్తంలో తలాకొంత పంచుకొని కొంతమేర ఢిల్లీకి మూటలు పంపారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ అధిష్ఠానం దూతలకు కూడా ఇది తెలుసని పేర్కొన్నారు. అందుకే తాము ప్రభుత్వాన్ని ఎన్నిసార్లు ప్రశ్నించినా మౌనవ్రతం పాటిస్తున్నదని ధ్వజమెత్తారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుపై కమిషన్లు, విచారణల పేరిట వేధిస్తున్న ప్రభుత్వం.. ధాన్యం టెండర్లలో అవినీతిపై ఎందుకు స్పందించడంలేదని నిలదీశారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ ఎలాంటి తప్పుచేయలేదు కాబట్టే విచారణకు సహకరించారని, మరీ తప్పుచేయకుంటే ప్రభుత్వం కోర్టు నోటీసులకు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.

క్యాబినెట్‌లో ఆమోదించేందుకు యత్నం

బిడ్డర్ల ఫైలను క్యాబినెట్ సమావేశంలో ఆమోదించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని, ఒకవేళ ఆమోదిస్తే ఈ కుంభకోణంలో మంత్రులందరూ భాగస్వాములవుతారని పెద్ది సుదర్శన్‌రెడ్డి హెచ్చరించారు. బిడ్డర్లు మిల్లర్ల నుంచి నగదు వసూలు చేయడం తప్ప ధాన్యాన్ని తరలించలేదని విమర్శించారు. ఇప్పుడు వారిని కాపాడేందుకే ప్రభుత్వం ధాన్యాన్ని ఫిలిప్పైన్స్‌కు పంపుతున్నట్టు ప్రకటించిందని పేర్కొన్నారు. వెంటనే బిడ్డర్లు పౌరసరఫరాల శాఖ ఖాతాల్లోకి రూ.1,100 కోట్లు జమ చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఈడీ, సీబీఐకి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కేటీఆర్ విదేశాల నుంచి తిరిగొచ్చిన తర్వాత సివిల్ సప్లయ్ ఆఫీసు ఎదుట ధర్నా చేస్తామని చెప్పారు.

కేంద్ర మంత్రులు స్పందించరేం?

ధాన్యం టెండర్లలో భారీ అక్రమాలు జరిగినా బీజేపీకి చెందిన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఎందుకు స్పందించడంలేదని పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రశ్నించారు. మోదీ సర్కారుకు చిత్తశుద్ధి ఉంటే ఈడీ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ, బోనస్, రైతుభరోసా ఎగవేతపై రైతులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని చెప్పారు. ఓట్ల కోసం ఊర్లకొచ్చే కాంగ్రెస్ నేతలను తరిమికొట్టేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, సభ్యుడు కిశోర్‌గౌడ్, అభిలాష్‌రెడ్డి, మహిళా నేత సుశీలారెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితకు మద్దతు తెలుపుతున్న రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య

'రైల్ రోకో'కు సంపూర్ణ మద్దతు

- ఎంపీ ఆర్ కృష్ణయ్య వెల్లడి
- బీసీ సంఘం నాయకుడితో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత భేటీ

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 22 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేస్తున్న బీసీ ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్టు బీసీ సంఘం నేత, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య వెల్లడించారు. తెలంగాణ జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ సంయుక్తంగా జూలై 17న తలపెట్టిన రైల్‌రోకోతోపాటు ప్రతి కార్యక్రమానికి తాము అండగా ఉంటామని ప్రకటించారు. ఆదివారం విద్యానగర్‌లోని ఆర్ కృష్ణయ్య నివాసంలో ఆయనతో ఎమ్మెల్సీ కవిత భేటీ అయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించేందుకు అసెంబ్లీ పాస్ చేసిన బిల్లు ఆమోదం కోసం కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకు చేపడుతున్న రైల్‌రోకోకు మద్దతివ్వాలని ఎమ్మెల్సీ కవిత కోరారు. ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. అనేక ప్రజాస్వామిక, సామాజిక ఉద్యమాలను కృష్ణయ్య నడిపించినట్టు కొనియాడారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలుకు పోరాటం చేస్తున్నట్టు తెలిపారు. ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ కవితకు బీసీలంతా మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. తరతరాలుగా అన్యాయం జరుగుతున్న బీసీల కోసం కవిత పోరాటం అభినందనీయమని పేర్కొన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని, లేదంటే రాష్ట్రంలో యుద్ధం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో యూపీఎఫ్ కన్వీనర్ బొల్లా శివశంకర్, కోఆర్డినేటర్ ఆలకుంట హరి, తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ అచారి, నాయకులు సత్యం తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ కళాశాలలో ఫుడ్‌పాయిజన్

- మహబూబాబాద్‌లో 17 మంది విద్యార్థినులకు అస్వస్థత
- వరుస ఘటనలతో సర్కారుపై వెల్లువెత్తుతున్న విమర్శలు

హైదరాబాద్, మహబూబాబాద్, జూన్ 22 (నమస్తే తెలంగాణ): మహబూబాబాద్‌లోని నర్సింగ్ కాలేజీలో ఫుడ్‌పాయిజన్‌తో 17 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. వీరిని హుటాహుటిన దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం మరోసారి బయటపడిందని విద్యార్థి సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. గురుకుల పాఠశాలల్లో వందలాది విద్యార్థులు దవాఖాన పాలయ్యారని తెలిపారు. ఇటీవల ఎర్రగడ్డ మానసిక వైద్యశాలలోనూ కలుషిత ఆహారంతో 90 మంది రోగులు అవస్థలు పడ్డారని, ఓ వ్యక్తి చనిపోయారని గుర్తుచేశారు. కాంగ్రెస్ పాలనలో పాఠశాలలు, కాలేజీలు, దవాఖానల్లో ఆహార భద్రతా ప్రమాణాలు పాటించడంలేదని విమర్శిస్తున్నారు.

మహేశ్వరంలో కాంగ్రెస్‌కు బిగ్ షాక్

- మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరికలు
- పార్టీలో చేరిన రాఘవేందర్‌రెడ్డి



కాంగ్రెస్ నేత రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న నాయకులకు గులాబీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న సబితాఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, జూన్ 22: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ పరువు తీస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పీ సబితాఇంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. మహేశ్వరం మండలం మన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన మర్యాద రాఘవేందర్‌రెడ్డితోపాటు వందలాదిమంది కార్యకర్తలు సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. రాఘవేందర్‌రెడ్డి చేరికతో కాంగ్రెస్ పార్టీకి మహేశ్వరం నియోజకవర్గంలో పెద్ద దెబ్బ తగిలినట్టు పరిశీలకులు భావిస్తున్నారు. ఈ సందర్భంగా సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాసంక్షేమాన్ని గాలికొదిలేసి కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలతో విసిగిపోతున్నవారు ఆ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరుతున్నారని పేర్కొన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లతోపాటు అన్ని ప్రభుత్వ పథకాలు అందజేయాలని డిమాండ్ చేశారు. సర్పంచ్ ఎన్నికల కోసమే రైతుభరోసా ఇస్తున్నారని దుయ్యబట్టారు. రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారులను ఎందుకు ఎంపిక చేయడంలేదని ప్రశ్నించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 19 మండలాలకు రైతుబంధును రద్దు చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పార్టీని నమ్మే పరిస్థితి లేదని చెప్పారు. రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు ప్రజల్లో తీవ్ర అసంతృప్తి కలిగిస్తున్నాయని, ప్రజలు మళ్లీ కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజునాయక్, పాండుయాదవ్, వెంకటేశ్వరరెడ్డి, ఎం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నువ్వు కూడా కిడ్నీ రోగమొచ్చే చస్తవ్!

- *మాగంటి గోపినాథ్‌కు చేసిన పూజనే నీక్కూడా స్టార్ట్ చేసిన*
- *కాంట్రాక్టర్‌కు సంధ్య కన్వెన్షన్ ఓనర్ శ్రీధర్‌రావు బెదిరింపు*
- *వైరల్‌గా మారిన ఫోన్ ఆడియో*

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 22 (నమస్తే తెలంగాణ): 'నాతో పెట్టుకున్నవ్.. 15రోజుల్లో నీ డౌన్‌ఫాల్ స్టార్టవుతుంది.. మాగంటి గోపినాథ్‌కు చేసిన పూజనే నీకు కూడా స్టార్ట్ చేసిన.. నువ్వు కూడా కిడ్నీ రోగమొచ్చి చస్తావ్.. శుక్రవారం పూట పూజ స్టార్ట్ చేసిన.. ఇయ్యాళ్టి నుంచి నువ్వు రోజులు లెక్కపెట్టుకో.. వంద కోట్లైనా ఖర్చుపెట్టి, నిన్ను రోడ్డుమీదకు తీసుకువస్తా!' ఇవీ హైదరాబాద్‌లోని సంధ్య కన్వెన్షన్ యజమాని శ్రీధర్‌రావు.. రహ్మత్‌నగర్‌కు చెందిన ఓ సెంట్రింగ్ కాంట్రాక్టర్‌ను బెదిరించిన మాటలు. ఇప్పుడు ఈ ఆడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళ్తే రహ్మత్‌నగర్‌కు చెందిన నర్సింహారెడ్డి వృత్తిరీత్యా సెంట్రింగ్ కాంట్రాక్టర్. కొంత కాలం క్రితం సంధ్య కన్వెన్షన్ యజమాని శ్రీధర్‌రావు వద్ద పనులు చేశాడు. డబ్బులు చెల్లించాలని నర్సింహారెడ్డి అడుగుతున్నాడు. ఈ విషయంలో ఇద్దరికి వివాదం నడుస్తున్నది. శుక్రవారం గచ్చిబౌలిలోని ఎఫ్‌సీఐ హౌసింగ్ సొసైటీ లేఅవుట్‌లో శ్రీధర్‌రావు, నర్సింహారెడ్డికి వాగ్వాదం జరిగింది. అదే రోజు రాత్రి శ్రీధర్‌రావు నర్సింహారెడ్డికి ఫోన్ చేసి దుర్భాషలాడాడు. చేతబడి, క్షుద్రపూజ చేయిస్తాననని బెదిరించాడు. ఇటీవల మరణించిన మాగంటి గోపీనాథ్ ప్రస్తావన కూడా తీసుకొచ్చాడు. శ్రీధర్‌రావుపై గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు నర్సింహారెడ్డి తెలిపారు. ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు చెప్తున్నారు. ఈనెల 18న గచ్చిబౌలి, ఎఫ్‌సీఐ హౌసింగ్ సొసైటీ లేఅవుట్‌లో హైడ్రా అధికారులు రోడ్ల రీమార్కింగ్ సమయంలో నటి రమ్యశ్రీ సోదరుడిపై, కుషీచంద్ అనే మరో వ్యక్తిపై శ్రీధర్‌రావు దాడులకు పాల్పడ్డాడు. దౌర్జన్యంగా వ్యవహరిస్తున్న శ్రీధర్‌రావుపై పోలీసులు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదంటూ సోషల్ మీడియాలో పలువురు ప్రశ్నిస్తున్నారు.